సరికొత్త ప్రాణ ఈవీ బైకులు

ధరల శ్రేణి రూ.2.55-3.20 లక్షలు

సింగిల్ చార్జ్‌పై 250 కిలోమీటర్లదాకా ప్రయాణం

చెన్నై, ఆగస్టు 22: తమిళనాడుకు చెందిన శ్రీవారు మోటర్స్.. గురువారం తమ ప్రీమియం ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ ప్రాణ 2.0 మాడల్‌ను ఆవిష్కరించింది. చెన్నై ఎక్స్ షోరూం ప్రకారం దీని ధర రూ.2,55,150. సింగిల్ చార్జింగ్‌పై 150 కిలోమీటర్లదాకా ప్రయాణం చేయవచ్చు. కాగా, ఈ సందర్భంగానే ప్రాణ ఎలైట్ బైక్‌నూ మార్కెట్‌కు పరిచయం చేసింది శ్రీవారు మోటర్స్. చెన్నై ఎక్స్ షోరూం ప్రకారం దీని ధర రూ.3,20,250గా ఉన్నది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 250 కిలోమీటర్ల వరకు వెళ్లవచ్చు. 2021లో ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ ప్రాణను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. తాజాగా ఇప్పుడు దాని అప్‌డేట్ వెర్షన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. కోయంబత్తూర్ సమీపంలోని సూలూర్‌లో ఈ సంస్థకు ప్లాంట్ ఉన్నది. ఇక్కడ నెలకు దాదాపు 2వేల బైకులు తయారవుతాయని ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక సీఈవో మోహన్‌రాజ్ రామస్వామి తెలిపారు. 10వేల యూనిట్ల అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకున్నది. త్వరలో 'ఎలైవ్' పేరిట ఎలక్ట్రిక్ స్కూటర్లనూ తేవాలని కంపెనీ చూస్తున్నది.

ఆడీ నయా క్యూ8 ఎస్‌యూవీ

ధర రూ.1.17 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ..దేశీయ మార్కెట్లోకి నయా మాడల్‌ను ప్రవేశపెట్టింది. ఎనిమిది రంగుల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.1.17 కోట్లుగా నిర్ణయించింది. రూ.5 లక్షలు చెల్లించి ఈ కారు ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కేవలం 5.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. భద్రత ప్రమాణాలు మెరుగుపరచడంలో భాగంగా ఈ కారులో ఎనిమిది ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది. వైర్‌లెస్ చార్జింగ్, రెండు డిజిటల్ స్క్రీన్లు, 3డీ సౌండ్ సిస్టమ్‌తో 17 స్పీకర్లు వంటి ఫీచర్లతో ఈ నయా కారును తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా ఆడీ ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ..ఈవీలతో పోలిస్తే హైబ్రిడ్ వాహనాలపై అత్యధికంగా 43 శాతం పన్నును విధిస్తున్నారని, దీనిని తగ్గించాలన్నారు. గత 15 ఏండ్లలో లక్ష యూనిట్లను దేశీయంగా విక్రయించింది.

టీవీఎస్ న్యూ జూపిటర్ 110

ఎక్స్‌షోరూం ప్రారంభ ధర రూ.73,700

న్యూఢిల్లీ, ఆగస్టు 22: దేశీయ ప్రధాన ద్విచక్ర వాహన తయారీ సంస్థల్లో ఒకటైన టీవీఎస్ మోటర్.. గురువారం తమ పాపులర్ మాడల్ జూపిటర్‌లో సరికొత్త వెర్షన్‌ను పరిచయం చేసింది. 110సీసీ సామర్థ్యంతో వచ్చిన ఈ స్కూటర్ ప్రారంభ ధర ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం రూ.73,700లుగా ఉన్నది. కాగా, మున్ముందు మార్కెట్‌లో స్కూటర్లకు మరింత డిమాండ్ ఉంటుందని, దేశీయ ద్విచక్ర వాహన అమ్మకాల్లో స్కూటర్ల వాటా త్వరలోనే ఇంచుమించుగా 40 శాతానికి చేరగలదని సంస్థ సీఈవో కేఎన్ రాధాకృష్ణన్ ఈ సందర్భంగా అంచనా వేశారు. ప్రస్తుతం టూవీలర్ అమ్మకాల్లో 32 శాతం స్కూటర్లవేనని తెలియజేశారు. నగరాలేగాక గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్కూటర్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని వివరించారు. ఇక పరిశ్రమ వార్షిక చక్ర వృద్ధిరేటు 8 శాతంగా ఉంటే.. తమ సంస్థది 12 శాతంగా ఉందని చెప్పారు. రాబోయే పండుగ సీజన్‌లో అమ్మకాలు బాగుంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొనుగోలుదారుల అభిరుచులకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్త మాడళ్లను ఆవిష్కరిస్తామన్నారు.

హైదరాబాద్-కోల్‌కతా మధ్య ఏఐ ఫ్లైట్

హైదరాబాద్, ఆగస్టు 22: టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా..తాత్కాలికంగా పలు రూట్లలో విమాన సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ పండుగ సీజన్‌లో హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరుల నుంచి నేరుగా కోల్‌కతాలకు అదనపు ఫ్లైట్ సర్వీసును అందుబాటులోకి తీసుకోస్తున్నట్లు వెల్లడించింది. దుర్గ పూజ సందర్భంగా ఈ రూట్లలో అత్యధిక మంది ప్రయాణించే అవకాశం ఉండటం ఇందుకు కారణమని తెలిపింది. కోల్‌కతాలో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరనున్న ఏఐ530 సర్వీసు హైదరాబాద్‌కు సాయంత్రం 5.40 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరనున్న ఈ సర్వీసు కోల్‌కతాకు 10.40కి చేరుకోనున్నది. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 26 వరకు మాత్రమే నడపనున్నట్లు తెలిపింది.



వాసవి గ్రూపు సంస్థల డైరెక్టర్ అభిషేక్ చందా తదితరులు

'వాసవిపై ఆరోపణలు అవాస్తవం'

అమీర్‌పేట్, ఆగస్టు 22: మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవమున్న సంస్థగా తన కస్టమర్ల పట్ల ఎంత పారదర్శకంగా వ్యవహరిస్తామో.. సామాజిక బాధ్యతల పట్ల కూడా అంతే నిజాయితీగా వ్యవహరిస్తున్నామని వాసవి గ్రూపు సంస్థల డైరెక్టర్ అభిషేక్ చందా పేర్కొన్నారు. అవగాహన లేమితో కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ చానెళ్లు పని గట్టుకుని తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తుండటాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. 1994లో ఎర్రమ్ విజయ్‌కుమార్ ప్రారంభించిన ఈ సంస్థ ఇప్పటి వరకు ఎక్కడా కస్టమర్లను ఇబ్బందులు పెట్టడం కానీ, బఫర్ జోన్ స్థలాలు, క్యాచ్‌మెంట్ భూములు, చెరువులను కబ్జాలు వంటి అక్రమ చర్యలకు ఎన్నడూ పాల్పడలేదని గురువారం వాసవి గ్రూపు సంస్థ న్యాయ సలహాదారు మాధవరావు, సంస్థకు చెందిన ఇతర ఉన్నతాధికారులు జాకీర్ హుస్సేన్, నర్సింహారావు, వరుణ్‌శర్మలతో కలిసి హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అక్రమాలకు దూరంగా పూర్తి స్థాయి పారదర్శకతతో ముందుకు సాగుతున్న తమను కొందరు వ్యక్తులు అవగాహన లేమితో కబ్జాలకు పాల్పడుతున్నట్లు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కేవలం వ్యాపారాత్మకంగానే కాక కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వాసవి సంస్థ ప్రభుత్వ సూచనల మేరకు ఇప్పటి వరకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ చెరువుల సుందరీకరణ, వరద నీటి కాలువలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ విద్యాలయాల్లో మౌళిక వసతుల కల్పన, పేద చిన్నారులకు జ్ఞానేంద్రియాల లోటుపాట్లను సవరించడం, మూగజీవాల సంరక్షణ వంటి అనేక కార్యక్రమాలకు సొంత నిధులను పెద్దయెత్తున వెచ్చిస్తున్నట్లు తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా రహదారి విస్తరణ కోసం 2.5 ఎకరాల తమ సొంత స్థలాన్ని ప్రభుత్వానికి గిఫ్ట్ డీడ్ చేసి ఇవ్వడం జరిగిందని, తాత్కాలిక రహదారులను కోట్లాది నిధులతో నిర్మించడం జరిగిందని, ఈ పనులన్నీ ఆయా ప్రభుత్వ విభాగాల అనుమతితో నిబంధనలకు లోబడి చట్టబద్ధంగా చేపట్టినట్లు చెప్పారు.

ఈసారి జీడీపీ 6 శాతమే

ఏప్రిల్-జూన్‌లో 6 త్రైమాసికాల కనిష్టానికి వృద్ధిరేటు పడిపోవచ్చంటున్న ఇక్రా

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్ లేదా క్యూ1)లో దేశ ఆర్థిక వృద్ధిరేటు 6 శాతంగానే ఉండొచ్చని భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా గురువారం అంచనా వేసింది. అయితే ఇది 6 త్రైమాసికాల కనిష్టం కావడం గమనార్హం. నిజానికి అంతకుముందు త్రైమాసికం జనవరి-మార్చిలోనూ 7.8 శాతంగా ఉన్నది. కానీ 3 నెలల వ్యవధిలో 1.8 శాతం మేర వృద్ధిరేటు పతనం.. ఇప్పుడు ఆర్థిక మందగమనాన్ని సూచిస్తున్నది. ఇక నిరుడు ఏప్రిల్-జూన్‌లోనైతే ఏకంగా 8.2 శాతంగా నమోదైంది. కాగా, ఈ నెల 30న క్యూ1 జీడీపీ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయనున్నది. ఈ క్రమంలో తాజా అంచనా ప్రాధాన్యాన్ని సంతరించుకోగా, ప్రభుత్వ మూలధన వ్యయంలో మందగమనం, పట్టణ వినీమయ డిమాండ్‌లో క్షీణతలే వృద్ధిరేటు పతనానికి దారితీస్తున్నాయని ఇక్రా చెప్తున్నది.

వాతావరణం దెబ్బ

దేశవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడకపోవడం, వాతావారణంలో తేమ శాతం పెరిగి వేడి గాలులు వీస్తుండటం కూడా వివిధ రంగాలను ప్రభావితం చేస్తున్నాయని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గిపోవడం కూడా ఎకానమీని బలహీనపరుస్తున్నదని చెప్పారు. ఇదిలావుంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంగా జీడీపీ 6.8 శాతంగా నమోదు కావచ్చని ఇక్రా తమ ప్రకటనలో తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) 8.2 శాతంగా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు గురువారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక.. గత నెల వచ్చిన ఆర్థిక సర్వేలో భారత జీడీపీ 6.5-7 శాతంగా ఉండొచ్చన్న అంచనా సరైనదేనని చెప్పుకొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు నిలకడగానే ఉన్నట్లు వెల్లడించింది.

పౌల్ట్రీ పరిశ్రమ సమస్యలు, డిమాండ్ల పరిష్కారార్థం గురువారం సీఎం రేవంత్ రెడ్డిని పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు కలిశారు. పౌల్ట్రీ రంగాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ ఏడాది నవంబర్ 27న హైటెక్స్‌లో నిర్వహించబోయే పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కూడా ఈ సందర్భంగా వారు ఆహ్వానించారు.

అదానీ చేతికి ల్యాంకో

న్యూఢిల్లీ, ఆగస్టు 22: అదానీ మరో విద్యుత్ ప్లాంట్‌ను హస్తగతం చేసుకున్నది. ఎన్‌సీఎల్‌టీ వద్ద ఉన్న ల్యాంకో అమర్‌కంటక్ పవర్ లిమిటెడ్‌ను రూ.4,101 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ ప్రతిపాదనకు ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్ అనుమతినిచ్చింది. ఎల్ ఏపీఎల్ ప్లాంట్‌లో 100 శాతం వాటా కొనుగోలు ప్రతిపాదనకు అనుమతినిచ్చింది.

హైదరాబాద్‌లో ఎహెడ్ ఆఫీస్

AHEAD

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఐటీ సేవల సంస్థ ఎహెడ్.. హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. గతేడాది గురుగ్రామ్‌లో 400 మంది సిబ్బందితో డెలివరీ ఆఫీస్‌ను ప్రారంభించిన సంస్థ..తాజాగా ప్రారంభించిన కార్యాలయం కోసం వచ్చే ఏడాదిలోగా 500 మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకోబోతున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్, ఎండీ ప్రవీణ్ గ్రోవర్ తెలిపారు. ఉత్తర భారతంతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభ కలిగిన టెక్నాలజీ నిపుణులు అత్యధికంగా ఉన్నారని, వీరితో క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి వీలు పడనున్నదన్నారు.

కేన్స్ టెక్ ఎలక్ట్రానిక్ యూనిట్ సిద్ధం

- నేడు కొంగరకలాన్‌లో ప్రారంభం
- 2వేల మందికి ఉద్యోగావకాశాలు
- బీఆర్ఎస్ హయాంలోనే బీజం

ఆదిబట్ల, ఆగస్టు 22: రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ సమీపంలో శుక్రవారం అధునాతన కేన్స్ టెక్ ఎలక్ట్రానిక్ యూనిట్ సెమికండక్టర్ల తయారీ సంస్థను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఆయనతోపాటు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు, స్పీకర్ ప్రసాద్ కుమార్‌లు హాజరు కానున్నారు.

రూ.2,800 కోట్ల పెట్టుబడి

కేన్స్ టెక్ ఎలక్ట్రానిక్ యూనిట్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీజం పడింది. గత ఏడాది అక్టోబర్‌లో కేన్స్ టెక్నాలజీ నాయకత్వ బృందం అప్పటి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అనంతరమే కొంగరకలాన్‌లో రూ.2,800 కోట్ల పెట్టుబడితో అవుట్‌సోర్స్ సెమికండక్టర్ సదుపాయాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు వారు ప్రకటించారు. ప్రభుత్వం తరపున కావాల్సిన అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని కేన్స్ టెక్ ప్రతినిధులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. దీంతో ఈ యూనిట్ ఏర్పాటుతో దాదాపు 2 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని సంస్థ పేర్కొన్నది. ఈ క్రమంలోనే ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 300లో 46 ఎకరాల భూమిని నాటి ప్రభుత్వం కేటాయించింది. శ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిశారు.

ఆమెనే సంపాదించుకోమనండి!

6 లక్షల మనోవర్తి కోరిన భార్యకు కోర్టు షాక్

బెంగళూరు: మాజీ భర్త నుంచి భారీగా మనోవర్తి పొందాలనుకున్న మహిళకు కర్ణాటక హైకోర్టు మహిళా న్యాయమూర్తి గట్టి షాక్ ఇచ్చారు. 'అంత సొమ్ము కావాలంటే ఆమెనే సంపాదించుకోమనండి' అని ఆమె తరపు న్యాయవాదికి చెప్పారు. భరణం అనేది భర్తకు శిక్షగా ఉండకూడదని తెలిపారు. న్యాయమూర్తి, న్యాయవాది మధ్య హైకోర్టులో జరిగిన సంభాషణ వీడియోను దీపిక నారాయణ్ భరద్వాజ్ అనే ఎక్స్ యూజర్ పోస్ట్ చేశారు. దీని ప్రకారం, పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ, ఆమెకు నెలకు రూ.6,16,300 భరణం కింద చెల్లించే విధంగా ఆమె మాజీ భర్తను ఆదేశించాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ, ఎవరైనా నెలకు రూ.6 లక్షలు ఏ విధంగా ఖర్చు పెట్టగలరని ప్రశ్నించారు. ఇది అసమంజసంగా ఉందన్నారు. దీనిపై న్యాయవాది వివరణ ఇస్తూ, పిటిషనర్ మోకాలి నొప్పితో బాధపడుతున్నారని, చికిత్స, ఫిజియోథెరపీ, మందులు, ఇతర ఖర్చుల కోసం నెలకు రూ.4-5 లక్షలు అవసరమవుతాయని చెప్పారు. గాజులు, చెప్పులు, శాండల్స్, గడియారాలు వంటివాటి కోసం నెలకు రూ.50,000; ఆహారం కోసం రూ.60,000 కావాలన్నారు. ఆమె మాజీ భర్త అన్నీ బ్రాండెడ్ దుస్తులనే ధరిస్తారని, రూ.10,000 విలువైన కెల్విన్ క్లీన్ టీ-షర్టులు ధరిస్తారని చెప్పారు. కానీ ఆమె పాత దుస్తులతోనే సరిపెట్టుకోవలసి వస్తుందన్నారు. అయితే ఆమె పిల్లల స్కూలు, ట్యూషన్ ఫీజును మాజీ భర్త చెల్లిస్తున్నట్లు అంగీకరించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ, 'ఓ వ్యక్తికి ఇవన్నీ అవసరమని మీరు కోర్టుకు చెప్పవద్దు. రూ.6,16,300 ఓ నెలకా? ఎవరైనా ఇంత సొమ్ము ఖర్చుపెడతారా?'' అన్నారు. ''సరే, అంత ఖర్చు చేయాలనుకుంటే, ఆమెను సంపాదించుకోమనండి. ఆమె భర్తపై ఆ భారం మోపవద్దు'' అని చెప్పారు. 'ఇంత సొమ్మును డిమాండ్ చేయడం అసమంజసమని మీ క్లయింటుకు వివరించండి' అని తెలిపారు. ఆమెకు ఇతర కుటుంబ బాధ్యతలేవీ లేవని, పిల్లల సంరక్షణ చూడవలసిన అవసరం లేదని చెప్పారు.

అమెరికాకే మనోళ్ల మొగ్గు!

- 30% పెరిగిన భారత విద్యార్థుల సంఖ్య
- అమెరికా వెళ్లాలనుకునే వారికి 25న ఢిల్లీలో ఎడ్యుకేషన్ ఫెయిర్
- సద్వినియోగం చేసుకోవాలన్న ఆ దేశ ప్రతినిధి గ్లోరియా

న్యూఢిల్లీ, ఆగస్టు 22: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారత విద్యార్థుల మొదటి ఎంపిక అమెరికా. మొత్తం విద్యార్థుల్లో 69 శాతం ఈ దేశంలోనే చదవాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు తమ దేశంలో కల్పిస్తున్న సౌకర్యాలు, ఇతర వివరాలను అమెరికా పబ్లిక్ డిప్లామసీ శాఖ మంత్రి సలహాదారు గ్లోరియా బెర్బెనా ఒక ఆంగ్ల మీడియాకు తెలియజేశారు. అమెరికా వచ్చే భారత విద్యార్థుల సంఖ్య గత ఏడాదిలోనే 30 శాతం పెరిగినట్టు ఆమె చెప్పారు. తమ దేశం పట్ల భారత విద్యార్థుల ఆసక్తి, అనురక్తి తమకెంతో ఆనందాన్ని కలిగిస్తున్నదని అన్నారు. గత ఏడాది తమ దేశానికి వచ్చిన విదేశీ విద్యార్థుల సంఖ్యలో భారతే నెంబర్ వన్ అని వెల్లడించారు. అమెరికా రావాలనుకునే విద్యార్థులు కొంతమంది బ్రోకర్లు, కన్సల్టెన్సీల చేతిలో మోసపోకుండా నేరుగా తామే విద్యార్థులతో సంబంధాలు పెట్టుకునేందుకు ఎడ్యుకేషన్ ఫెయిర్‌లను నిర్వహిస్తున్నామని చెప్పారు. దీని వల్ల వారి సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. అందులో భాగంగా 125 అమెరికా యూనివర్సిటీల ఆధ్వర్యంలో ఈ ఆదివారం ఢిల్లీలో ఒక ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమెరికా రావాలనుకునే విద్యార్థులు దీనికి హాజరు కావాలని ఆమె కోరారు. వివిధ యూనివర్సిటీలలో ఉన్న కోర్సులు, దరఖాస్తు విధానం, వీసా నిబంధనలు, అయ్యే ఖర్చెంత, ప్రవేశార్హత ఇలా తమకు కావాల్సిన వివరాలన్నీ ఇందులో పొందవచ్చునని ఆమె వెల్లడించారు. తమ దేశంలోని 4,500 ఉన్నత విద్యా సంస్థలు అద్భుతమైన అక్రిడేటెడ్ డిగ్రీ విద్యను అందిస్తున్నాయని, భారత విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యూకేలో తగ్గుతున్న భారత్ విద్యార్థులు

ఒక వైపు అత్యధికంగా భారత విద్యార్థులకే యూకే వీసాలు మంజూరు చేస్తుండగా, మరో పక్క యూకే యూనివర్సిటీలకు దరఖాస్తు చేసే భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. ఇటీవల ఆ దేశంలో విధించిన వలస విధాన ఆంక్షలు, వలసదారులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలు, ఇతర కారణాల వల్ల ఆ దేశం వెళ్లాలనుకుంటున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందని గురువారం వెలువడిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఉన్న డాటాను పోలిస్తే ఉన్నత విద్య కోసం యూకేకు వచ్చే భారతీయ విద్యార్థుల సంఖ్య 23 శాతం తగ్గింది. గ్రాడ్యుయేషన్ నిమిత్తం వచ్చే విద్యార్థులను ప్రోత్సహించేందుకు చదువైన తర్వాత వారు రెండేండ్ల పాటు దేశంలోనే ఉండేందుకు అనుమతించే గ్రాడ్యుయేట్ రూట్ వీసాను ఇస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తగ్గడం గమనార్హం. స్టూడెంట్ వీసా ఉన్నవారు తమతో పాటు తమపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను బ్రిటన్‌కు తెచ్చుకునేందుకు గతంలో అనుమతి ఉండేది. అయితే దానిపై ఆంక్షలు విధిస్తూ గత ఏడాది తెచ్చిన కొత్త నిబంధనలు ఈ తగ్గుదలకు ప్రధాన కారణంగా కన్పిస్తున్నది. 2019-2023 కాలంలో యూకేకు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా ఉండేది. వీరిలో ఎక్కువగా భారతీయులు, నైజీరియన్లు ఉండేవారు. అయితే తాజా గణాంకాలు చూస్తే వరుసగా వీరిలో 23 శాతం, 46 శాతం తగ్గుదల నమోదైంది.

పాల ఉత్పత్తులపై ఎ1, ఎ2 తొలగించండి

- ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

న్యూఢిల్లీ: ఎ1, ఎ2 రకాల పాలు, పాల ఉత్పత్తులంటూ ప్యాకేజింగ్‌లో చేస్తున్న ప్రచారాన్ని ఆహార వ్యాపార కంపెనీలు, ఈ-కామర్స్ సంస్థలు వెంటనే తొలగించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ తరహా ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని తెలిపింది. ఈ తరహా ప్రచారం ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006కు అనుగుణంగా లేదని తెలిపింది. పాలలోని బీటా కెరోటిన్ ప్రొటీన్ నిర్మాణానికి సంబంధించిన తేడాలను బట్టి ఎ1, ఎ2 పాలుగా వర్గీకరిస్తున్నారని.. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం తమ సంస్థ ఈ తేడాలను గుర్తించదని వెల్లడించింది.

'హిండెన్‌బర్గ్ నివేదికపై జేపీసీతో దర్యాప్తు జరపాలి'

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఆరోపణలపై సంయుక్త పార్లమెంట్ కమిటీ (జేపీసీ)తో విచారణ జరపాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సెబీ చైర్‌పర్సన్ మాధబి బచ్, అదానీ గ్రూప్‌కు వ్యతిరేకంగా 'హిండెన్‌బర్గ్' బయటపెట్టిన అంశాలపై దర్యాప్తు చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ గురువారం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. లక్నోలో రాజ్‌భవన్, ముంబైలో ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేపట్టారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలపై జేపీసీ ద్వారా స్వేచ్ఛాయుత, పారదర్శక దర్యాప్తు నిర్వహించాలని సచిన్ పైలట్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

మనోవర్తి కోసం ఏడుగురితో పెండ్లి!

బెంగళూరు: కర్ణాటకలోని ఓ మహిళ ఏడుగురిని వివాహం చేసుకుని, వారందరిపైనా వేధింపుల కేసు పెట్టి, మనోవర్తి పొందుతున్నారు. ఏడో భర్తపై పెట్టిన గృహ హింస కేసు విచారణకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. దీపిక నారాయణ భరద్వాజ్ అనే ఎక్స్ యూజర్ ఈ వీడియోను పోస్ట్ చేశారు. జడ్జి, ఆమె తరపు న్యాయవాదుల మధ్య జరిగిన సంభాషణ ఈ వీడియోలో కనిపించింది. ఆమె ఏడుగురిని పెళ్లి చేసుకుని, ఒక్కొక్కరితో 6 నెలల నుంచి 1 సంవత్సరం వరకు కాపురం ఉంటున్నది. ఆ తర్వాత గృహ హింస కేసు పెట్టి, మనోవర్తి పొందుతున్నది. ఇప్పటి వరకు ఆరుగురు మాజీ భర్తల నుంచి మనోవర్తి ఆమెకు లభించింది. ఇప్పుడు ఏడో భర్తపై కేసు విచారణ జరుగుతున్నది. జడ్జి మాట్లాడుతూ, 'మీరు చట్టంతో ఆటలాడుతున్నారు' అన్నారు.

ఆసియన్ల రాకపై బ్రెజిల్ ఆంక్షలు

- యూఎస్‌కు వలసలు నిరోధించేందుకే

సావో పౌలో: ఆసియా నుంచి వచ్చే కొందరు విదేశీయులపై బ్రెజిల్ ఆంక్షలు విధించడం ప్రారంభించనుంది. అమెరికా, కెనడాలకు వలస వెళ్లేందుకు తమ దేశాన్ని లాంచింగ్ పాయింట్‌గా వాడుకుంటూ ఉండటం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ దేశ న్యాయ శాఖ బుధవారం వెల్లడించింది. విమానాశ్రయంలో ఆశ్రయం కోసం 70 శాతానికి పైగా అభ్యర్థనలు భారత్, నేపాల్ లేదా వియత్నాం జాతీయుల నుంచి వస్తున్నాయని తెలిపింది. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆంక్షల్లో భాగంగా ఇకపై ఆసియా దేశాల నుంచి వచ్చేవారు బ్రెజిల్‌లో వలసదారులుగా ఉండాలంటే వీసా ఉండాలి. అయితే ఇప్పటికే వీసా నుంచి మినహాయింపు పొందిన ఆసియన్లకు ఈ నిబంధన వర్తించదు.

ఎయిర్‌పోర్టులో గుండెపోటు.. సీపీఆర్ చేసి రక్షించిన సీఐఎస్ఎఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి గుండెపోటుతో కుప్పకూలిపోయారు. సీఐఎస్ఎఫ్ జవాన్లు ఆయనకు వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించారు. మంగళవారం ఉదయం టర్మినల్-2 ద్వారా శ్రీనగర్ బయలుదేరాల్సిన అర్షిద్ అయూబ్ హఠాత్తుగా కుప్పకూలిపోయారు. సీఐఎస్ఎఫ్ తక్షణ ప్రతిస్పందన బృందం వెంటనే ఆయనకు సీపీఆర్ చేసి ఆయన పరిస్థితి కుదుటపడేలా చేసింది. అనంతరం ఆయనను

సఫ్దర్‌జంగ్ దవాఖానలో చేర్పించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మోదీ తర్వాత ఎవరు?

- సర్వే నిర్వహించిన 'ఇండియాటుడే'
- ఎవరికీ చెప్పుకోదగ్గ మద్దతు లేని వైనం
- 25% మద్దతుతో ముందున్న షా
- తర్వాతి స్థానాల్లో యోగి, గడ్కరీ

న్యూఢిల్లీ: బీజేపీలో 75 ఏండ్ల వయస్సు వచ్చాక రాజకీయాల నుంచి రిటైర్ అవ్వాలనే అనధికార నిబంధన కొనసాగుతున్నది. మరికొన్ని రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సైతం 75 ఏండ్లు రాబోతున్నాయి. ఒకవేళ ఈ నిబంధన పాటించి ప్రధాని పదవి నుంచి మోదీ తప్పుకుంటే ఎవరు ఆ బాధ్యతలు చేపడతారనే ఆసక్తి నెలకొన్నది. ఈ నేపథ్యంలో 'ఇండియా టుడే' మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో ఒక సర్వే జరిపింది. ఏ బీజేపీ నేతకూ చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రజా మద్దతు లేదని ఈ సర్వేలో తేలింది. అమిత్ షాకు 25 శాతం మంది, సీఎం యోగికి 19 శాతం మంది మద్దతు లభించింది. నితిన్ గడ్కరీ ప్రధాని కావాలని 13 శా